ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించాలి

- కలెక్టర్ విజయేందిరబోయి
- ప్రజావాణికి 86 వినతులు, ఫిర్యాదులు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, మార్చి 3: ప్రజావాణి ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ విజయేందిరబోయి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం అధికారులతో సమీక్షించారు. ఎప్పటి ఫిర్యాదులు అప్పుడే పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమానికి 86 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టరేట్‌తోపాటు అదనపు కలెక్టర్లు శివేంద్రప్రతాప్, మోహన్‌రావు, ఆర్డీవో నవీన్, జిల్లా అధికారులకు అందజేశారు.

ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్లు, అధికారులు

దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

సమస్య తెలుసుకుంటున్న కలెక్టర్ సిక్తాపట్నాయక్

నారాయణపేట టౌన్, మార్చి 3: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యత ఇస్తూ ఆర్జీలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ సిక్తాపట్నాయక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 25 ఫిర్యాదులు వచ్చాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలు కలెక్టర్‌కు విన్నవిస్తూ ఆర్జీలు సమర్పించారు. కార్యక్రమంలో ఆర్డీవో రాంచందర్, ఏవో జయసుధ తదితరులు పాల్గొన్నారు.

దారిద్ర్యరేఖకు ఎగువన ఉన్నామంటుండ్రు

తినడానికి తిండి లేక.. ఉండటానికి గూడు లేక.. నిత్యం వలసలు వెళ్తే.. వివిధ ప్రాంతాలు తిరుగుతూ పొట్టపోసుకుంటే.. మమ్మల్ని బీపీఎల్ కాదు.. ఏపీఎల్ (దారిద్ర్యరేఖకు ఎగువన) ఉన్నామంటుండ్రు.. ఎప్పుడే ఎనకటికి ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చారని రికార్డులు చెబుతున్నాయంటూ ఇప్పుడు మాకు బీఆర్ఎస్ హయాంలో కేటాయించిన రెండు పడకగదుల ఇండ్లు తిరిగి లాక్కుంటుండ్రు.. రూ.51,200లు ఇందిరమ్మ ఇంటి కింద మాకు పైసలు ఇచ్చామని మహబూబ్‌నగర్ అర్బన్ మండలం అధికారులు నోటీసులు ఇచ్చిండ్రు.. మౌలాలిగుట్ట వద్ద తండా భూములు 1, 2, 3 ఎకరాలు ఉంటే ఆ భూములు తీసుకునే అక్కడ ఇండ్లు కట్టిండ్రు.. ఇప్పుడు మాట మారుస్తుండ్రు.. కలెక్టరమ్మా..! మీరే మాకు న్యాయం చేయాలి.

- లంబాడితండా, ఏనుగొండ గిరిజనులు, మహబూబ్‌నగర్

వైకుంఠధామాన్ని కాపాడాలి

మహబూబ్‌నగర్ అర్బన్ మండలంలోని మాలగుట్టలోని వైకుంఠధామం భూములు అక్రమార్కుల పరం కాకుండా కాపాడాలి. తాత, ముత్తాతల కాలం నుంచి అనాధిగా సర్వే నెం.439లో పాతపాల మూరు దళితవాడకు చెందినవారు వైకుంఠధామంగా కొనసాగిస్తున్నారు. కొందరు అక్రమార్కులు కబ్జాకు పాల్పడుతున్నారు. వారిబారి నుంచి భూములు కాపాడడంతోపాటు హద్దులు నిర్ణయించి, కంచె వేయాలి.

- పాతపాలమూరు దళితవాడ స్థానికులు, మహబూబ్‌నగర్

స్థానికులకు న్యాయం చేయాలి

ఓనర్ కమ్ డ్రైవర్లుగా జీవనోపాధి పొందుతున్న మమ్మల్ని కాదని స్థానికేతరులకు జడ్చర్లలోని లారీ అసోసియేషన్‌లో మెంబర్ షిప్ ఇస్తున్నారు. అప్పు చేసి కొనుగోలు చేసిన లారీలకు ఈఎంఐలు, ఫైనాన్స్‌లు కట్టలేక నిత్యం నరకం అనుభవిస్తున్నాం. ఇతర రాష్ట్రాల సరుకు రవాణా చేస్తున్న లారీలు నడుపుతూ కుటుంబాలను నెట్టుకొస్తున్నాం. సీజన్‌లో ఇతర రాష్ట్రాల నుంచి బ్రోకర్ల ద్వారా ఇతర లారీలను పిలిపించి వారికి లోడింగ్ ఇస్తున్నారు. మాకు మెంబర్ షిప్ ఇప్పించి న్యాయం చేయాలి.

- లింగంపేట్ లారీ ఓనర్ కమ్ డ్రైవర్లు, జడ్చర్ల మండలం

అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు

- పేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి

ధన్వాడ, మార్చి 3: కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, ప్రతి పేదకు ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేస్తామని నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కంసాన్‌పల్లిలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధన్వాడలో భూగర్భ జల శాఖ ద్వారా హరిజన్‌వాడకు మంజూరు చేసిన 7బోర్లను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ. నియోజకవర్గంలో రూ.200 కోట్ల రుణమాఫీ చేసినట్లు పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, 500లకే సిలిండర్ తదితర పథకాలను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కంసాన్‌పల్లిని ఆదర్శ గ్రామంగా మారుస్తామని తెలిపారు. కార్యాక్రమంలో ఎంపీడీవో సాయి ప్రకాశ్, ఎంపీవో వెంకటేశ్వర్‌రెడ్డి, తాసీల్దార్ సిందూజా, నాయకులు నిరంజన్‌రెడ్డి, నరహరి, రాఘవేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, బస్వరాజ్, రాంచంద్రయ్య, పంచాయతీ కార్యదర్శి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

కుటుంబ కలహాలతో..
వాగులో దూకి మహిళ ఆత్మహత్య

బాలానగర్, మార్చి 3: కుటుంబంలో కలహాలు.. భర్తతో మనస్పర్థలు వెరసి ఓ వివాహిత వాగులో దూకి ఆత్మహత్య చేసుకున్న విషాదఘటన బాలానగర్ మండలంలో చోటుచేసుకున్నది. ఎస్సై లెనిన్ కథనం ప్రకారం.. ఫరూక్‌నగర్ మండలం గంట్లవెల్లికి చెందిన చారకొండ లక్ష్మి (35) ఆదివారం రాత్రి బాలానగర్ సమీపంలోని దుందుభీ వాగులో దూకి ఆత్మహత్య చేసుకుంది. బాలానగర్ మండలం గుండేడుకు చెందిన లక్ష్మికి గంట్లవెల్లికి చెందిన లింగంకు కొంతకాలం కిందట వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య తగాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో రెండు రోజుల కిందట లక్ష్మి పుట్టినిల్లయిన గుండేడుకు వచ్చింది. ఆదివారం సాయంత్రం 6:30 గంటల ప్రాంతంలో ఇంట్లోంచి కనపడకుండా వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు వెతుకుతూ బాలానగర్ వైపు వెళ్తుండగా బాలానగర్ వాగు వంతెనపై ఆమె పాదరక్షలు కనిపించాయి. అనుమానంతో వాగులో పరిశీలించగా లక్ష్మి చీర కనిపించింది. మృతురాలి తల్లి రాములమ్మ ఫిర్యాదు మేరకు వాగులో గాలించిన పోలీసులకు వాగులో లక్ష్మి మృతదేహం లభ్యమైంది. ప్రాథమిక విచారణ అనంతరం మృతదేహాన్ని జడ్చర్ల దవాఖానాకు తరలించారు. సోమవారం శవపరీక్ష అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ విజయేందిరబోయి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, మార్చి 3: ఇంటర్మీడియట్, పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ విజయేందిరబోయి సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈనెల 5నుంచి ఇంటర్మీడియట్, 21వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయన్నారు. ఇంటర్ పరీక్షలు 22,483 మంది విద్యార్థులు రాయనుండగా 36 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పదో తరగతి పరీక్షలు 13,038 మంది రాయనుండగా 60 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. రెవెన్యూ, పోలీసు, విద్యా, వైద్యారోగ్యశాఖ, పంచాయతీ, ఆర్టీసీ, ఆర్టీవో అధికారులు వారికి నిర్దేశించిన విధులు, బాధ్యతలు నిక్కచ్చిగా నిర్వర్తించాలని సూచించారు. సంబంధిత అధికారులు తాసీల్దార్లు, డీటీలు, గెజిటెడ్ అధికారులను, సబ్ ఇన్స్‌పెక్టర్లను ఫ్లయింగ్ స్క్వాడ్స్‌గా నియమించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. పరీక్షల్లో ఎలాంటి పేపర్ లీకేజీ, మాస్ కాపీ, మాల్ ప్రాక్టీస్ వంటివి జరగకుండా చూడాలన్నారు. పైవేటు కేంద్రాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. ఎలక్ట్రానిక్ వస్తువులు ఏవైనా కేంద్రాల్లోకి అనుమతి లేదని స్పష్టం చేశారు. అంతకు ముందు జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

జాతీయస్థాయిలో విజేతగా నిలవాలి

క్రీడాకారులను అభినందిస్తున్న జిల్లా జడ్జి పాపిరెడ్డి

మహబూబ్‌నగర్ అర్బన్, మార్చి 3: జాతీయస్థాయి ఆర్చరీలో జిల్లా క్రీడాకారులు విజేతగా నిలవాలని జిల్లా జడ్జి పాపిరెడ్డి అన్నారు. ఇటీవల తెలంగాణ ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలు నిర్వహించగా అండర్ 10, 13, 15 కంపౌండ్ విభాగంలో 18మంది బాల, బాలికలు జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఏపీలోని గుంటూర్ జిల్లాలో ఈనెల 22నుంచి 27వ తేదీ వరకు నిర్వహించే జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలో ఎంపికైన క్రీడాకారులు పాల్గొంటారని కోచ్ జ్ఞానేశ్వర్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని స్టేడియం మైదానంలో సోమవారం జిల్లా జడ్జి పాపిరెడ్డి, ఆర్చరీ అసోసియేషన్ సంఘం సెక్రెటరీ రాంచంద్రయ్య, వివేక్ క్రీడాకారులను అభినందించారు.

వినికిడి సమస్యను నిర్లక్ష్యం చేయొద్దు

- జిల్లా జనరల్ దవాఖాన సూపరింటెండెంట్ సంపత్‌కుమార్‌సింగ్

మహబూబ్‌నగర్, మార్చి 3: చెవిలో సమస్య వచ్చినవారు నిర్లక్ష్యం చేయకూడదని వెంటనే వైద్యులను సంప్రదించి సమస్యను పరిష్కరించుకోవాలని మహబూబ్‌నగర్ జనరల్ దవాఖాన సూపరింటెండెంట్ సంపత్‌కుమార్ సింగ్ తెలిపారు. సోమవారం మార్చి 3వ తేదీ ప్రపంచ వినికిడి సమస్య అవగాహన దినం సందర్భంగా దవాఖాన ఆధ్వర్యంలో ఈఎన్‌టీ విభాగధిపతి, సూపరింటెండెంట్ సంపత్ కుమార్ సింగ్ ఏనుగొండలో చెవి సమస్యలు ఉన్నావారికి ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్‌ఫోన్ అధిక వినియోగం ఎన్నో అనర్థాలకు దారి తీస్తోందని, ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. దీంతో వినికిడి సమస్య బాధితులు పెరుగుతున్నారని చెప్పారు. వైద్యశిబిరంలో మొత్తంగా 85 పెద్దవారు, 50 మంది ప్రైమరీ, హైస్కూల్ పిల్లలు హాజరయ్యారు. వీరిలో 15మంది ఉన్నత శస్త్రచికిత్స అవసరమని గుర్తించి జనరల్ దవాఖానకు తరలించారు. ఐదుగురికి హియరింగ్ బడ్స్ అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో ఈఎన్‌టీ వైద్యులు, ఏపీఐ అధ్యక్షుడు చంద్రశేఖర్, అసోసియేట్ అధ్యక్షుడు శ్రీకాంత్, అసోసియేట్ ప్రొఫెసర్ డా.వైష్ణవి, డా.రమేష్, డీసీసీబీ వైస్ చైర్మన్ కోరమోని వెంకటయ్య, ఆడియో మెట్రి టెక్నీషియన్ సతీశ్‌రెడ్డి, ఇతర వైద్యసిబ్బంది, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

చెవి పరీక్షలు చేస్తున్న సూపరింటెండెంట్

రాజీమార్గంతో సమస్యల పరిష్కారం

- పాలమూరు ఎస్పీ జానకి

మహబూబ్‌నగర్, మార్చి 3: జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవాలని ఎస్పీ జానకి తెలిపారు. సోమవారం ఎస్పీ చాంబర్‌లో మాట్లాడుతూ.. వివాదాలు ఒకసారి ప్రారంభమైతే జీవితాంతం కొనసాగుతూనే ఉంటాయని, వాటిని త్వరగా పరిష్కరించుకోవాలన్నారు. రాజీ మార్గమే రాజమార్గమనే సూత్రాన్ని అనుసరించి వివాదాలను చక్కదిద్దుకోవడానికి జాతీయ లోక్‌అదాలత్ అద్భుతమైన అవకాశమన్నారు. జిల్లాలో వివిధ రకాల రాజీపడదగిన కేసుల్లో ఉన్న కక్షిదారులకు విజ్ఞప్తి చేశారు. ఉచిత న్యాయసేవా సంస్థ ఆధ్వర్యంలో మార్చి 8వ తేదీ వరకు మహబూబ్‌నగర్, జడ్చర్ల కోర్టులో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించబడుతుందన్నారు. కక్షిదారులు అవకాశాన్ని ఉపయోగించుకుని, తమ కేసులను రాజీ చేసుకోవచ్చని తెలిపారు.

పరీక్షల్లో ఉత్తీర్ణతసాధిస్తే మంచి అవకాశాలు

వేణుగోపాల్‌రావును సన్మానిస్తున్న సెట్విన్ సభ్యులు

మహబూబ్‌నగర్ అర్బన్, మార్చి 3: పరీక్షల్లో ఉత్తీర్ణత సాధిస్తే విలువైన సెట్విన్ సర్టిఫికెట్‌తోపాటు బ్యాంకుల ద్వార రుణ సదుపాయం పొందవచ్చని సెట్విన్ ఎండీ వేణుగోపాల్‌రావు అన్నారు. మహబూబ్‌నగర్ ఫస్ట్ నవరత్నాలు భాగంగా బీకేరెడ్డి కాలనీలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సొంత నిధులతో మహిళలకు వివిధ రంగాల్లో మూడు నెలలపాటు ఇచ్చే వృత్తి శిక్షణ ముగియడంతో సోమవారం 224 మందికి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సెట్విన్ మహబూబ్‌నగర్ ఇన్‌చార్జి విజయ్‌కుమార్, గుండా మనోహర్, నిజలింగప్ప పాల్గొన్నారు.

సరిహద్దు దాటుతున్న ధాన్యం లారీలు

- కృష్ణ చెక్‌పోస్టు వద్ద దాడులు నిర్వహించి పట్టుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్ అధికారులు

మాగనూరు/ఊట్కూర్, మార్చి 3: అధికారుల కళ్లుగప్పి సర్కార్ ధాన్యాన్ని సరిహద్దు దాటిస్తుండగా ఎన్‌ఫోర్స్‌మెంట్ విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించి పట్టుకున్నారు. కొన్నాళ్లుగా తెలంగాణలోని పలు ప్రాంతాలకు చెందిన మిల్లర్ల వద్ద ఉన్న వరి ధాన్యం స్టాక్‌ను అక్రమార్కులు ఆసరాగా చేసుకుని సరిహద్దు దాటించి సొమ్ము చేసుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదే క్రమంలో కృష్ణ చెక్‌పోస్ట్ సరిహద్దును దాటించి కర్ణాటకలోని రాయిచూరు జిల్లా కేంద్రానికి తరలి వెళ్తున్న ఏడు లారీలను సోమవారం సాయంత్రం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పక్కా సమాచారంతో దాడులు నిర్వహించి కర్ణాటకలోకి తరలిపోకుండా నిలువరించారు. ఈ క్రమంలో లారీ డ్రైవర్లను అధికారులు ప్రశ్నించగా.. ధాన్యం బస్తాల తరలింపునకు సంబంధించిన వే బిల్లులు, యజమానుల వివరాలకు పొంతనలేని సమాధానం ఇవ్వడంతో అనుమానం వచ్చిన అధికారులు పట్టుబడిన లారీలను సీజ్ చేసి కృష్ణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వీటిలో ఓ లారీలో 25 కేజీలకు సంబంధించిన 1,160 బియ్యం బస్తాలు, మిగిలిన 6లారీల్లో దాదాపు 3,500 వరి ధాన్యం బస్తాలను గుర్తించి కేసు నమోదు చేశారు. దాడులో ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్ ఓఎస్డీ డీఎస్పీ, వెంకటేశం, డీఎస్పీ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై పండరి, తాసీల్దార్ ప్రభాకర్, డీటీ గురురాజారావు పాల్గొన్నారు.

కరివెన ప్రాజెక్టు ముంపు బాధితులు రుణాలు చెల్లించాలి

భూత్పూర్, మార్చి 3: మండలంలోని భట్టుపల్లితండావాసులు పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో పొలాలు కోల్పోయిన రైతులు రుణాలను చెల్లించాలని బ్యాంకు అధికారులు తండావాసులను కోరుతున్నారు. సోమవారం మండలంలోని వెల్కిచర్ల తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ వెంకటేశ్, సిబ్బంది ఏవీఆర్ తండాకు వెళ్లి రుణాల విషయంపై చర్చించారు. 2019వ సంవత్సరంలో తీసుకున్న రుణాలు ప్రభుత్వ రుణమాఫీకి వర్తించలేదని మేనేజర్ వివరించారు. ఇందుకు తండావాసులు కొందరు ఒప్పుకోక తప్పలేదు. మరికొంతమంది ఇప్పుడు డబ్బులు లేవు, ఆలోచిస్తామని చెప్పారు. సర్వం కోల్పోయిన మేం రుణాలను చెల్లించే స్థితిలో ఉన్నామా అని చెప్పారు. ఏవీఆర్ తండా వ్యాప్తంగా దాదాపు 50మంది రుణాలు చెల్లించాల్సి ఉన్నట్లు మేనేజర్ తెలిపారు. ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని మేనేజర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆంజనేయులు, తండావాసులు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న మేనేజర్ వెంకటేశ్

రూ.45 లక్షలతో సీసీ రోడ్డు పనులు

కందూరులో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాయకులు

మూసాపేట(అడ్డాకుల), మార్చి 3: కందూరు రామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం రూ.45లక్షలతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కిసాన్ సెల్ చైర్మన్ నాగిరెడ్డి, మండలాధ్యక్షుడు శ్రీహరి మాట్లాడుతూ.. దక్షిణ కాశీగా పేరుగాంచిన కందూరు రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు సమీపిస్తుడడంతో భక్తుల సౌకర్యార్థం సీసీ రోడ్డు మంజూరు చేయాలని ఎమ్మెల్యే జీఎంఆర్‌ను కోరగా.. అందుకు ఆయన కలెక్టర్ విజయేందిరబోయికి సూచించారు. కలెక్టర్ చొరవ తీసుకొని ప్రత్యేకంగా రూ.45లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఆ నిధులతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించినట్లు తెలిపారు. అదేవిధంగా అడ్డాకుల ఎస్సీ కాలనీలో కూడా సీసీరోడ్డు పనులను జిల్లా ప్రధానకార్యదర్శి విజయమోహన్‌రెడ్డి ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈవో రాజేశ్వర్‌శర్మ, నిర్వాహణ అధికారి అనంతసేన శర్మ, హన్మంతు, శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాములు, బుచ్చన్నగౌడ్, సత్తిరెడ్డి, వేగనాథ్, అజాం, మోహన్, బాలరాజు, వెంకటయ్య, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌పై సీఎం మౌనం వీడాలి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, మార్చి 3: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌పై సీఎం రేవంత్‌రెడ్డి మౌనం వీడాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీస్కైలాబ్ బాబు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని అరుంధతి భవన్‌లో కేవీపీఎస్ రాష్ట్రస్థాయి సమావేశాలు 2వ రోజు ముగింపు సభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ కార్పొరేషన్‌ను బలోపేతం చేసే విధంగా బడ్జెట్ కేటాయింపులు ఉండాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 11 నెలల కింద దళితులకు ప్రకటించిన ఎన్నికల వాగ్దానాలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలడుగు నాగార్జున అధ్యక్షత వహించారు. సమావేశంలో కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు అడివయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు కుర్మయ్య, మనోహర్, ఆరూరి కుమార్, రాధాకృష్ణ, ప్రకాశ్ కారత్, సహాయ కార్యదర్శులు సురేశ్, మందసంపత్, దినకర్, రామ్మూర్తి, జిల్లా అధ్యక్షుడు మాణిక్యం రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

పరీక్ష ప్యాడ్‌లను పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

ఊట్కూర్, మార్చి 3: విద్యార్థులు క్రమశిక్షణ పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సింగిల్ విండో అధ్యక్షుడు బాల్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సూర్యప్రకాశ్‌రెడ్డి పేర్కొన్నారు.. బీఆర్ఎస్ నేత, మాజీ సింగిల్ విండో చెర్మన్ దివంగత నారాయణరెడ్డి జ్ఞాపకార్థం సోమవారం ఆయన కుటుంబ సభ్యులు, లయన్స్ క్లబ్ నారాయణపేట శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లతోపాటు పెన్సులు, పెన్సిళ్లు, రేజర్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు శివారెడ్డి, పారిజాత, సత్యనారాయణరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు పెండింగ్‌లో ఉంచరాదు

నారాయణపేట, మార్చి 3: ప్రజావాణిలో బాధితులు అందించిన ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా చట్టప్రకారం పరిశీలించి పరిష్కరించాలని ఎస్పీ యోగేశ్‌గౌతమ్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం పట్టణంలోని ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి 5 ఫిర్యాదులు వచ్చాయి. బాధితుల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలని సంబంధిత సీఐలు, ఎస్సైలకు ఫోన్‌లో ఆదేశించారు. సివిల్ ఫిర్యాదులు కోర్టులో పరిష్కరించుకోవాలని బాధితులకు సూచించారు.

రైతుల పంటలను కాపాడాలని ఫిర్యాదు

దేవరకద్ర, మార్చి 3: మండలంలోని రైతుల పంట పొలాలను కాపాడాలని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో బీఆర్ఎస్ మాజీ మండలాధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్ ఎంపీడీవో శ్రీనివాస్‌రావు, తాసీల్దార్ కృష్ణయ్యకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడుతూ.. మండలంలోని బల్సుపల్లి సమీపంలో ఉన్న క్రషర్ మిషన్ ఉండడంతో అక్కడ గుట్టలో ప్రతిరోజూ బ్లాస్టింగ్ చేయడంతో గుట్ట సమీపంలోని వ్యవసాయ రైతుల పంటపొలాల్లో పెద్ద పెద్ద రాళ్లు, దుమ్ము వస్తుండడంతో పంటలు పూర్తిగా నష్టపోతున్నట్లు పేర్కొన్నారు. క్రషర్ మిషన్ నిర్వాహకులపై చర్యలు తీసుకొని రైతుల పంటలను కాపాడాలని కోరారు. అదేవిధంగా వివిధ అంశాలపై మొత్తం ఐదు ఫిర్యాదులు వచ్చినట్లు ఎంపీడీవో తెలిపారు.

తాగునీటి ఎద్దడి ఏర్పడనీయొద్దు

నవాబ్‌పేట, మార్చి 3: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా పంచాయతీ కార్యదర్శులు, వాటర్‌గ్రిడ్ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా సహకార అధికారి, మండల ప్రత్యేకాధికారి శంకరాచారి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం తాగునీటి ఎద్దడి నివారణ, ఉపాధిహామీ పనులపై ఆయన ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎక్కడైనా నీటి సమస్య ఉత్పన్నమైతే వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేసి సమస్య పరిష్కారమయ్యే విధంగా చూడాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, వాటర్‌గ్రిడ్ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే వేసవి కారణంగా ఉపాధిహామీ కూలీలు మధ్యాహ్నం పూట పనులు చేపట్టకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఉదయం పూటనే పనులు చేపట్టేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జయరామ్‌నాయక్, ఎంపీవో భద్రునాయక్, ఏఈ షమీయుల్లాఖాన్, ఏపీవో జ్యోతి, ఉపాధి ఈసీ నర్సింహాచారి, సిబ్బంది పాల్గొన్నారు.

తండ్రిని హత్య చేసిన తల్లీకొడుకు

హన్వాడ, మార్చి 3: మండలంలోని ఇబ్రహీంబాద్‌లో తండ్రిని హత్యచేసిన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన శ్రీనివాస్‌గౌడ్(47) భార్య లక్ష్మితో ఆదివారం రాత్రి గొడవపడ్డాడు. శ్రీనివాస్‌గౌడ్ తాగి ఇంట్లో నిద్రిస్తుండగా.. భార్య తన కుమారుడు సహాయంతో శ్రీనివాస్‌గౌడ్‌ను వైర్‌తో గొంతునులిమి హత్య చేసింది. ఎవరికీ అనుమానం రాకుండా మంచానికి ఉరి వేసుకున్నట్లు కట్టుకత చేసింది. గతంలో కూడా భార్య అక్రమ సంబంధం ఉందని బతుకుజట్కా బండికి వెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు. అలాగే ఆయన పేరు మీద భూమి ఉన్నందున అతను చనిపోతే రైతుబీమా డబ్బులు వస్తాయని ఆశతో తనను హత్య చేశారని శ్రీనివాస్‌గౌడ్ సోదరుడు తిరుమలేశ్ అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని శవాన్ని పోస్టుమాస్టు నిమిత్తం జిల్లా దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థుల స్వపరిపాలన దినోత్సవం

జాజాపూర్ ఉన్నత పాఠశాలలో..

ఊట్కూర్/ కృష్ణ/ధన్వాడ/నారాయణపేటరూరల్/గండీడ్, మార్చి 3: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. హెచ్ఎం మాధవి ఆధ్వర్యంలో విద్యార్థులు పాఠాలు బోధించి ఆకట్టుకున్నారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి బహుమతులను అందజేశారు. పలువురు విద్యార్థులు కలెక్టర్, హెచ్ఎం, డీఈవో, ప్రజాప్రతినిధులుగా వ్యవహరించి అలరించారు. కృష్ణ మండలంలోని ముడుమాల జెడ్పీహెచ్ఎస్‌లో కలెక్టర్‌గా అర్చన, డీఈవోగా వివేకానందగౌడ్, ఎంఈవోగా అశ్విని, హెచ్ఎంగా మహేశ్వరి, ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. హెచ్ఎం నిజామోద్దీన్ అనంతరం బహుమతులు